
కిడ్నీలో స్టోన్స్.. డేంజర్ బెల్స్

- రోజురోజుకు పెరుగుతున్న బాధితులు
- ఆధునిక జీవనశైలితో కిడ్నీలకు చేటు
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

గుంటూరు మెడికల్: కిడ్నీల్లో రాళ్లు ఏర్పడుతున్న బాధితుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఫాస్ట్‌ఫుడ్స్‌కు బాగా అలవాటు పడిపోయి తాగునీరు సరిపడినంతా తాగకపోవడంతో యువతరం కూడా కిడ్నీ సమస్యల బారిన పడుతోంది. కిడ్నీలో రాళ్ల సైజు పెరిగే కొద్ది బాధ కూడా పెరిగిపోతూ మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రాళ్లు ఉండి వైద్యం తీసుకుంటున్నవారు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే విషయంపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

లక్షణాలు

కిడ్నీలో రాళ్లు ఏర్పడిన వారికి నడుము నుంచి జననేంద్రియాల వరకు తీవ్రమైన నొప్పి వస్తుంది. వాంతులు అవుతాయి. మూత్రంలో మంట వస్తుంది. మూత్రంలో రక్తం పడుతుంది. షుగర్ బాధితులకు జ్వరం ప్రారంభమై నడుంనొప్పి వస్తుంది. నొప్పి వచ్చిన సమయంలో మనిషిని మెలేసినట్లుగా ఉంటుంది.



కిడ్నీలో ఏర్పడిన రాయి

రాళ్లు ఏర్పడటానికి కారణాలు..

జంక్‌ఫుడ్స్ బాగా తినడం, నాన్‌వెజ్ ఎక్కువగా తినేవారిలో కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. ప్రతి రోజూ 3 నుంచి 4 లీటర్ల తాగునీరు తాగనివారు, వేసవిలో ఐదు లీటర్ల మంచినీరు తాగని వారికి కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశాలు ఎక్కువ. ఒకసారి కిడ్నీలో రాళ్లు వస్తే మళ్లీ ఐదేళ్ల తరువాత 50 శాతం మందిలో రాళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పుట్టుకతో కిడ్నీలో తేడాలు ఉండటం వల్ల కూడా రాళ్లు ఏర్పడతాయి. శరీరం తీరు కూడా రాళ్లు ఏర్పడటానికి ఒక కారణంగా పేర్కొనవచ్చు. కాల్షియం, యూరిక్‌యాసిడ్, సైస్టీన్, ఆగ్జలేట్‌లు మూత్రంలో ఎక్కువగా పోయేవారు అధిక మొత్తంలో తాగునీరు తాగుతూ ఉండాలి. లేనిపక్షంలో నీరు తక్కువగా ఉండి అవి రాళ్లుగా మారుతాయి. కుటుంబంలో ఎవరికైనా కిడ్నీలో రాళ్లు ఏర్పడి ఆపరేషన్ చేయించుకోవడం, లేదా వైద్యం తీసుకుంటూ ఉన్నట్లయితే మిగతా సభ్యులు కూడా ఏమాత్రం ఆలోచించకుండా మూత్రపిండాల పరీక్ష చేయించుకోవడం చాలా ఉత్తమం. వారసత్వంగా కిడ్నీలో రాళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

వయసుతో సంబంధం లేదు..

కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి వయసుతో సంబంధం లేదు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరిలో కూడా రాళ్లు ఏర్పడతాయి. 22 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు వారిలో, 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు వారిలో హార్మోన్లలో తేడాల వల్ల రాళ్లు ఏర్పడతాయి. మూడు మిల్లీమీటర్ల నుంచి కిడ్నీసైజు వరకు రాళ్లు ఏర్పడతాయి. గుంటూరు జిల్లాలో 15 మంది యూరాలజిస్టులు ఉన్నారు. ప్రతి రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు ముగ్గురు కిడ్నీ స్టోన్స్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు.

ఈ పరీక్ష ప్రతి ఒక్కరూ చేసుకోవాలి

ఒక లీటర్ నీరు తాగిన తర్వాత మూత్రం బాగా తెల్లగా రావాలి. మంచినీరు తాగిన నాలుగు గంటల అనంతరం మూత్రం కొంచెం పసుపు పచ్చగా వస్తే కిడ్నీలు బాగా పనిచేస్తున్నాయని అర్థం చేసుకోవాలి. మంచినీరు తాగినప్పుడు, నీరు తాగకుండా ఉన్న సమయంలో కూడా ఒకేలా మూత్రం వస్తుందంటే తప్పనిసరిగా మూత్ర పిండాల వైద్య నిపుణులను సంప్రదించాలి. ఇలాంటి పరీక్ష ఇంట్లోనే ప్రతి ఒక్కరు చేసుకుని వైద్యులను సంప్రదించి వైద్య సలహాలు పాటించాలి.

ఇవి పాటిస్తే రాళ్లు ఏర్పడవు



కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా పొటాషియం, మెగ్నీషియం లభించి మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడకుండా నివారించవచ్చు. క్యారెట్లు, కాకరకాయ తీసుకోవడం వల్ల మినరల్స్ పుష్కలంగా లభించి రాళ్లు ఏర్పడకుండా నివారిస్తాయి. అరటి పండ్లు తినడం ద్వారా ఆక్సాలిక్ యాసిడ్‌ను విభజించి రాళ్లు ఏర్పడటాన్ని నివారిస్తుంది. నిమ్మరసం తాగడం వల్ల సైట్రేట్‌లు పుష్కలంగా లభించి రాళ్లు ఏర్పడకుండా చేస్తుంది. అనసపండు రసం, బార్లీ, ఓట్లు తీసుకోవడం ద్వారా రాళ్లు ఏర్పడకుండా నివారించవచ్చు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతి రోజూ మూడు లీటర్ల నీరు తాగడం ద్వారా మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడకుండా జాగ్రత్త పడవచ్చు.

– డాక్టర్ జొన్నకూటి కొర్నేలియస్, యూరాలజిస్టు, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచితంగా ఆధునిక వైద్యం



జీజీహెచ్‌లో ప్రతి బుధ, శనివారం వివిధ రకాల మూత్ర సంబంధిత సమస్యలతో 200 మంది వైద్యం కోసం వస్తున్నారు. వారిలో 100 మంది రాళ్లు ఏర్పడి ఇబ్బంది పడుతున్నవారే. మూత్ర పిండ సమస్యలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చి ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నాం. కార్పొరేట్ ఆస్పత్రుల్లో లభించే ఆధునిక వైద్య పద్ధతులతో గుంటూరు జీజీహెచ్‌లో పేద రోగులకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నాం.

– డాక్టర్ బూసం ప్రకాశరావు, యూరాలజీ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

క్లుప్తంగా

పోస్టల్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మెట్ల ఎన్నిక



లక్ష్మీపురం: అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మెట్ల రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌బాబు శనివారం వివరాలు వెల్లడించారు. ఈనెల 2, 3 తేదీలలో తెనాలిలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఎన్నికైనట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యవర్గ సమావేశాల్లో కౌన్సిల్ సమావేశంలో తపాల ఉద్యోగుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన రామకృష్ణ మాట్లాడుతూ యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం చండీహోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల నిర్వహణలో 13 మంది వేదపండితులు గణపతి పూజ, లక్ష్మీగణపతి, రుద్ర, చండీ హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సిహెచ్. మస్తానయ్య పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



పాత గుంటూరు: ఆంధ్రా ముస్లిం కళాశాల సమీపంలోని శ్రీ హజరత్ మొహమ్మద్ ఖాశీం అలీషా ఖాదరీ దర్గా 101వ గంధ(సందల్) మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కస్మూర్ దర్గా గాదీనషీన్ సయ్యద్ షబ్బీర్ పీరాముర్షద్ బృందం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహబూబ్ సుభాని జెండా ఆవిష్కరించారు. కార్యక్రమాలను ధర్మకర్త జనాబ్ మొహమ్మద్ మహమూద్ సాహెబ్, పీఠాధిపతి హజరత్ మొహమ్మద్ మన్సూర అహ్మద్ అలీషా ఖాదరీ అల్ హసనీ వల్ హుస్సైనీ, ట్రస్ట్ సభ్యులు షేక్. మీరా బొభియుద్దీన్ అహ్మద్, షేక్. ఖాజా మొయినుద్దీన్ అహ్మద్ కార్యక్రమాలను నిర్వహించారు.

గాయని వాణీ జయరాం మృతికి నివాళి

పాత గుంటూరు: ప్రముఖ సినీ గాయని వాణీ జయరాం మృతికి గుంటూరుకు చెందిన కళా సంస్థల ప్రతినిధులు, సంగీతాభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. వాణీ జయరాంతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆలాపన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2017లో వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వాణీ జయరాంకు సుస్వరవేణి అవార్డును అందించి సత్కరించారు. కళా దర్బార్ అధ్యక్షులు పొత్తూరి రంగారావు, నాగార్జున సాంస్కృతిక కేంద్రం, సంగీత పాఠశాల అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సూర్యనారాయణ, వాణీ జయరాంకు నివాళులర్పించారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఈనెల 16, 17 తేదీలలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ శనివారం ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ విజన్ ఆన్ ఎడ్యుకేషన్ రిఫ్లక్షన్ ఇన్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ–2020' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు కేంద్రం డైరెక్టర్ వై.అశోక్ కుమార్ తెలిపారు. సదస్సులో దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య ఎం.త్రిమూర్తిరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో శ్రమదానం

గుంటూరు వెస్ట్: మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మన ఆరోగ్యం బాగుంటుందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో స్వచ్ఛ కలెక్టరేట్‌లో భాగంగా శనివారం శ్రమదానం చేశారు. జేసీ మాట్లాడుతూ ప్రతి శనివారం సాయంత్రం రెండు గంటల పాటు ఆయా కార్యాలయాల ఆవరణలో సిబ్బంది, అధికారులు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. సిబ్బందిగాని, విజిటర్స్‌గాని తినుబండారాలు, వాటర్ బాటిల్స్ ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చూడాలన్నారు. ప్రతి కార్యాలయం వద్ద పరిశుభ్ర వాతావరణం ఉంటే పరిసరాలు కూడా ఆహ్లాదంగా మారతాయని చెప్పారు. కలెక్టరేట్‌లోని పలు ప్రాంతాలను జేసీ స్వయంగా శుభ్రపరచి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో శ్రమదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ

జీజీహెచ్‌లో నర్సింగ్ సేవలు కీలకం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరిన కె.ఆశాసజనిని శనివారం పలువురు నర్సింగ్ సిబ్బంది, వైద్య అధికారులు, వైద్యులు సన్మానించారు. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగి త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకోవడంతో నర్సింగ్ సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. నర్సింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నప్పుడే ఆస్పత్రిలో పరిపాలన సులువుగా ఉంటుందని చెప్పారు. గతంలో జీజీహెచ్‌లో నర్సింగ్ వృత్తిలో ఎంతో అనుభవం ఉండి, నేడు నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఆశాసజని విధుల్లో చేరడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ పద్మశ్రీ, క్యాన్సర్ వైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ టి.వి.శివరామకృష్ణ, నాట్కో ట్రస్టు సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్, నర్సుల సంఘం నాయకురాలు ఆవుల విజయ పాల్గొన్నారు.



నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని సన్మానిస్తున్న దృశ్యం

విజ్ఞాన్‌లో ఘనంగా 'వర్టెక్స్'

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ కార్యకలాపాలు ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా వర్టెక్స్ (విజ్ఞాన్ ఆన్‌లైన్ రీక్రియేషనల్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషనల్ ఎక్స్‌పీరియన్స్) అనే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన్ ఆన్‌లైన్ ద్వారా బీబీఏ, ఎంబీఏ, బీసీఏ, ఎంసీఏ విభాగాల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం విజ్ఞాన్ ఆన్‌లైన్ ఎక్స్‌పీరియన్స్ అనే ప్లాట్‌ఫామ్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీపుల్ స్ట్రాటజీ, కల్చర్ అండ్ హ్యాపీనెస్ అట్ లిట్మస్ 7 హెడ్ అరవింద్ వారియర్ మాట్లాడుతూ వీవోఎక్స్ వల్ల విద్యార్థులకు ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్‌లతో పాటు ప్రముఖ విద్యా వేత్తల నుంచి గైడెన్స్‌తో కూడిన మెంటర్‌షిప్ పొందే అవకాశం ఉందన్నారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ 21వ శతాబ్దంలో విద్యార్థులు ఉపాధ్యాయుల పైనో, కళాశాలల్లో ఉండే అధ్యాపకుల పైనో ఆధారపడకూడదని, సెల్ఫ్ లెర్నింగ్‌కు నిజమైన భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విజ్ఞాన్ ఆన్‌లైన్ సీఈవో నందిగం శ్రీకాంత్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొంది ఈ– లెర్నింగ్‌లో కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులందరినీ వర్టెక్స్ కార్యక్రమం ద్వారా కలుసుకోవటం సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్ అవసరాలు, మారుతున్న పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఎప్పటికప్పుడు టెక్నాలజీని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అరవింద్ వారియర్

మాతృమూర్తులకు పాదాభివందనం

గుంటూరు ఎడ్యుకేషన్: సంపత్‌నగర్‌లోని శ్రీరామకృష్ణ శిశు విద్యామందిరంలో శనివారం మాతృ వందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ మాతృమూర్తులకు పాదపూజ చేసి, ఆశీర్వాదం పొందారు. పాఠశాల డైరెక్టర్ శ్రీనాథ్ విద్యార్థులతో అమ్మకు వందనం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు పాతూరి వేంకట రామశాస్త్రి, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, లక్ష్మీదుర్గా, జయలక్ష్మి, భార్గవి, భూలక్ష్మి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: సహజీవనం చేస్తున్న మహిళతో వివాదమై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. నెహ్రూనగర్‌కు చెందిన గోడా కిరణ్‌కుమార్(29) బొంగరాలబీడులో జ్ఞానమ్మ అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. మహిళతో వివాదం ఏర్పడిన నేపథ్యంలో శనివారం ఆమె నివాసంలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత..

పట్నంబజారు: కట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. నాయుడుపేటలోని సాకేతపురానికి చెందిన రాగ మౌనిక (28) అదే ప్రాంతానికి చెందిన నాగసతీష్‌తో గత ఏడాది క్రితం వివాహం జరిగింది. ఈక్రమంలో కట్నం సరిపోలేదని భార్యను వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. వేధింపులు తాళలేక మౌనిక శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి తోట నాగశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 5లక్షల విరాళం

పెదనందిపాడు: మండలంలోని నాగులపాడు శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం (నాగులపాడు పుట్ట)కు చిలకలూరిపేటకు చెందిన ఎ. శివరామాంజనేయకుమార్, సత్య లావణ్య దంపతులు శనివారం విరాళం అందజేశారు. రూ. 5 లక్షల చెక్కును ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సాంబశివరావు, సెక్రటరీ విజయ్‌కుమార్, ట్రెజరర్ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సుబ్బారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ సభ్యులు స్వామి తీర్థప్రసాదాల్ని అందించి, వారిని అభినందించారు.

వ్యభిచారానికి పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

పట్నంబజారు: వ్యభిచారానికి పాల్పడుతున్న ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. కొరిటెపాడులోని ఓ నివాసంలో వ్యభిచారానికి పాల్పడుతున్న ఇద్దరు మహిళలతో పాటు ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.5,200 స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

క్యాన్సర్‌కు భయపడాల్సి పనిలేదు

- ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోంది
- తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి

గుంటూరు మెడికల్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు ఆటోనగర్‌లోని ఒమెగా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్టు, మెడికల్ డైరెక్టర్ ఎం.జి.నాగకిషోర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ ఎన్.లక్ష్మీపార్వతి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి సోకగానే భయపడాల్సిన పనిలేదన్నారు. సకాలంలో వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యమని చెప్పారు. ఒమెగా హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో క్యాన్సర్ వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. డాక్టర్ మోహన్ వంశీ, డాక్టర్ ఎం.జి.నాగకిషోర్ సేవలను వివరించారు. ఒమెగా హాస్పిటల్‌లో క్యాన్సర్ డే సందర్భంగా గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాల, కమ్మజన సేవా సమితి, గన్నవరంలోని వీకేఆర్ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, వ్యాక్సినేషన్ ప్రక్రియ గురించి వివరించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న లక్ష్మీపార్వతి, పక్కన వైద్యులు

ఘనంగా సంగీత సన్మండలి రజతోత్సవం

పాత గుంటూరు: గాయత్రి మహిళా సంగీత సన్మండలి రజతోత్సవ సభ శనివారం వైభవంగా నిర్వహించారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం వేడుకలు నిర్వహించారు. సభలో ముఖ్య అతిథిగా నంబూరు చిట్ ఫండ్ ఎండీ కొండా కోటిరెడ్డి, డాక్టర్ కోగంటి వెంకట శ్రీ రంగనాయకమ్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన విదుషి విష్ణుభొట్ల పూర్ణ గాయత్రీ శివానికి గాయత్రి యువ సంగీత రత్న బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్ణ గాయత్రి వయోలిన్ సోలో శాస్త్రీయ సంగీత కచేరి చేశారు. వీరికి మృదంగంపై కె.అరవింద్, ఘటంపై సరస్వతుల హనుమంతరావు వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమాలను కార్యదర్శి మంగాదేవి, లలిత పర్యవేక్షించారు.



పూర్ణ గాయత్రి శివానిని సత్కరిస్తున్న శేషురాణి, కొండా కోటిరెడ్డి, రంగనాయకమ్మ

సర్వైకల్ క్యాన్సర్‌కు అందుబాటులో వ్యాక్సిన్

గుంటూరు మెడికల్: వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా యువ నారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక గుంటూరువారి తోట 7వ లైనులోని హోప్‌విన్ హాస్పిటల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ షమసుల్తానా పలువురు మహిళలకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు చేశారు. సర్వైకల్ క్యాన్సర్ సోకకుండా వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, మహిళలు తప్పనిసరిగా వ్యాక్సిన్ చేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు అన్నారు. బాలికలకు తొమ్మిదేళ్ల వయస్సు నుంచే సర్వైకల్ క్యాన్సర్ రాకుండా ముందస్తుగా ఈ వ్యాక్సిన్ చేయించడం ఎంతో మంచిదని చెప్పారు. అనంతరం గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రోగులకు పండ్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు, పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ షమ సుల్తానా

పొత్తూరి రంగారావుకు ఎక్సలెన్సీ అవార్డు

పాత గుంటూరు: రింగురోడ్డులోని ఓ కల్యాణ వేదికపై రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150 ఆధ్వర్యంలో రోటరీ ఉత్తేజం పేరుతో రోటరీ జిల్లా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన ఆరుగురికి అవార్డుల ప్రదానం చేశారు. కళా రంగం నుంచి గుంటూరుకు చెందిన కళాదర్బార్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావుకు రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ చైర్మన్ పీడీజీ డాక్టర్ రవి వడ్లమాని, జిల్లా గవర్నర్ తల్లా రాజశేఖర్ రెడ్డి, కాన్ఫరెన్స్ సెక్రటరీ అనిల్, ఒకేషనల్ డైరెక్టర్ బి.శ్రీనివాస్, పాల్గొన్నారు



రంగారావును సత్కరించిన రోటరీ ప్రతినిధులు

శోభాయమానంగా భవ్య కలశ యాత్ర

ప్రత్తిపాడు: గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో శనివారం సాయంత్రం భవ్యకలశ యాత్ర వైభవంగా నిర్వహించారు. తొలుత గోపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక అక్షయ విద్యాలయ ప్రాంగణం నుంచి అంకమ్మగుడి, ఇందిరాగాంధీ బొమ్మ సెంటరు, బస్టాండు మీదుగా గాయత్రి అమ్మవారి చిత్రపటాలతో, 108 పవిత్ర కలశాలతో పెద్దఎత్తున యువతులు, మహిళలు ఊరేగింపుగా యజ్ఞస్థలానికి చేరుకున్నారు. అనంతరం రాత్రి 2400 ప్రమిదలతో దీప మహాయజ్ఞాన్ని నిర్వహించారు.

నేడు మహాయజ్ఞం

స్థానిక అక్షయ స్కూల్ ఆవరణలో ఆదివారం గాయత్రి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మిరియాల సత్యనారాయణబాబు, మండవ ప్రసాద్, చాగంరెడ్డి శివగోవింద్ రెడ్డి చెప్పారు. విశ్వశాంతి, దేశ అరిష్ట నివారణ, వాతావరణ పరిష్కారం, సద్బుద్ధి అలవడటం, లోక కల్యాణం, సుఖశాంతులకు గాయత్రీ మహాయజ్ఞం దోహదం చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా వేదపద్ధతిలో, భారతీయ సంప్రదాయంగా గర్భిణులకు పుంసవన సంస్కారం, నామకరణ సంస్కారం, అక్షరాభ్యాస సంస్కారం, గాయత్రీ మంత్రదీక్షకు గురుదీక్ష, ఉపనయన సంస్కారం, పెళ్లిరోజు సంస్కారం, పుట్టిన రోజు సంస్కారాల్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళల కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



కలశ యాత్ర నిర్వహిస్తున్న యువతులు, మహిళలు

ముమ్మరంగా ఈద్గా అభివృద్ధి పనులు

పెదకాకాని: గ్రామంలోని పాతూరు ఈద్గా అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతంలో అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నిధులు(ఎంపీ గ్రాంట్స్) రూ. 7 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షణలో వీటితో ఈద్గాకు రెండు వైపులా ప్రహరీ, రెండు వైపుల గేట్లు, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పనుల్ని శనివారం ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ నజీర్ అహ్మద్ పరిశీలించారు. ముస్లింలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే విధంగా పనులు చేపట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

వైభవంగా తిరుపతమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

గుంటూరు రూరల్: నగర శివారు 48వ డివిజన్‌లోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి ఆలయ 11వ బ్రహ్మోత్సవాలు మూడు రోజులుగా కమిటీ ఆధర్యంలో నిర్వహిస్తున్నారు. ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామికి గ్రామస్తులు పొంగళ్లను సమర్పించారు. అర్చకులు అభిషేకాలు, పూజలు చేసి స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అనంతరం మహాన్నదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఈదా సాంబిరెడ్డి, అధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ తనబుద్ధు కృష్ణారెడ్డి, కంది సంజీవరెడ్డి, తనబుద్ధు శ్రీనివాసరెడ్డి, ఈదా పరసురామిరెడ్డి, పప్పుల వెంకటరెడ్డి, కోటా వెంకటేశ్వరరెడ్డి, పిట్టల శ్రీనివాస్, యర్రసాని రోసిరెడ్డి, కనికిరెడ్డి సీతారామిరెడ్డి, ఈదా కోటిరెడ్డి, పప్పుల రెడ్డమ్మ పాల్గొన్నారు.



పొంగళ్లను సమర్పిస్తున్న భక్తులు